క్లుప్తంగా

గుంతల్లో మొరం తోలకం



సాక్షి ఎఫెక్ట్..

టేకులపల్లి: మండల కేంద్రంలో పలు చోట్ల ప్రధాన రహదారి వెంబడి వర్షపు నీరు నిల్వ ఉన్న గుంతల్లో పంచాయతీ అధికారులు సోమవారం మొరం పోయించారు. ఈ మేరకు గుంతల్లో నీరు నిల్వ ఉన్న సమస్యపై సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'మురుగు నిల్వలతో జనం అవస్థలు' అనే కథనానికి అధికారులు స్పందించి గుంతల్లో మొరం తోలించారు.

నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న నయీమ్ ఖురేషి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ముస్లిం మైనార్టీ నాయకులు నయీమ్ ఖురేషి ఆధ్వర్యంలో అంజుమన్ వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీ ఎన్నిక సోమవారం కొత్తగూడెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నయీమ్ ఖురేషి మాట్లాడుతూ... నూతనంగా ఎన్నికైన సభ్యులు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి పాటుపడాలన్నారు. కమిటీ అధ్యక్షుడిగా అమీర్ ఖాద్రి, ప్రధాన కార్యదర్శిగా ఎండి.అంకుష్, కోశాధికారిగా సయ్యద్ తాజుద్దీన్, ఉపాధ్యక్షుడిగా ఎండీ.కమర్, గౌరవాధ్యక్షులుగా రంజాన్ ఖాన్, ఎస్‌కె.దస్తగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ యూసఫ్, కమిటీ సభ్యులుగా ఎండి.అక్బర్, జమాల్, సయ్యద్ ఫైజుద్దీన్, ఖాదర్, ఉస్మాన్ పాషా, ఫరీద్, బాబు జాని ఖాన్‌లను ఎన్నుకున్నారు. సొసైటీ సలహాదారులు, చైర్మన్‌గా నయీమ్ ఖురేషి వ్యవహరించనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 వరకు పాత కొత్తగూడెం, గౌతమ్‌నగర్, గాంధీనగర్, గంగా భిషన్‌బస్తీ, సింగరేణి ప్రధాన ఆస్పత్రి ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎం.నర్మద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉద్యోగులకు జీపీఎఫ్ కల్పించాలని నిరసన

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగులకు ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చి పెన్షన్ సౌకర్యం కల్పించాలని జీపీఎఫ్ సాధన కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కేటీపీఎస్ అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నాయకులు మంగీలాల్, రమాకాంత్, సుధాకర్, రవీందర్, కోటేశ్వరరావు, వినోద్‌బాబు, జోలీ శ్రీను, రాంబాబు, అనిల్‌కుమార్, నరేందర్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

ఇల్లెందురూరల్: సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు నిరసన శిబిరాల వద్ద ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని గ్రామ సంఘ సహాయకులు (వీవోఏ) డిమాండ్ చేశారు. సెర్ప్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటైన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ... సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు నవ్య, పాపారావు, లత, సుమతి, కృష్ణ, సునిత, మోతీలాల్, అరుణ, విజయకుమారి ఉన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ఇల్లెందురూరల్: ఈ నెల 31న హైదరాబాద్‌లో నిర్వహించే పీవోడబ్ల్యూ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని ఉమ్మడి చల్లసముద్రం పంచాయతీలో సోమవారం సంఘం నాయకులు ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కల్తి కోటమ్మ, కల్తి సుభద్ర మాట్లాడుతూ.. ఈ నెల 22న ఇల్లెందులో నిర్వహించే భారీ ప్రదర్శనకు మహిళలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

పదోన్నతులు కల్పించాలి

పాల్వంచ: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, నిరుద్యోగులకు కోసం బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని మాల విద్యుత్ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బూర్గుల విజయ భాస్కర్ అన్నారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి రాందాస్ అత్తల్వాన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ నెల 13న హైదరాబాద్‌కు వస్తానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

హై లెవల్ కష్టాలు..

హరిజనచెర్రి-రాంపురం మధ్య రాళ్లవాగు ఉధృతి (ఫైల్)



వంతెనలు లేక తిప్పలు
- చిన్న వానకే ఉప్పొంగుతున్న వాగులు
- వరదొస్తే రాకపోకలు పూర్తిగా బంద్
- వ్యవసాయ పనులకు ఇక్కట్లు

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో వర్షాకాలం వరద ప్రభావంతో ఏజెన్సీ ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ప్రధానంగా అవసరమైన చోట హై లెవెల్, లో లెవెల్ వంతెనలు లేకపోవడంతో వరద ప్రభావం కారణంగా రాకపోకలు నిలిచి నానా తంటాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. పాలకులు మారుతున్నా టేకులపల్లి ఏజెన్సీ ప్రజల తలరాతలు మాత్రం మారడం లేదు.

వానాకాలం బిక్కుబిక్కుమంటూ..

గతంలో అడపాదడపా వంతెనలు మంజూరై నిర్మించినప్పటికీ ఇంకా అనేక చోట్ల వంతెనల అవసరం ఉంది. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో వాగులు, కాలువల సరిహద్దు గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని గ్రామాల్లో వర్షం వస్తే ఎటూ వెళ్లకుండా ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తే రాకపోకలు నిలిచిపోతున్నాయి. అత్యవసర సమయాల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా మారుతుంది. వ్యవసాయ పనులకు వెళ్లేవారు వాగు తగ్గే వరకు పొలాల వైపు చూసే పరిస్థితి లేకుండా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇక్కడ వంతెనలు నిర్మించాల్సిందే..



పెట్రాంచెలకలో గుండం వాగు.. (ఫైల్)



ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు- ప్రెగళ్లపాడు మధ్య..(ఫైల్)

మండలపరిధిలో ముర్రేడు, కిన్నెరసాని, పుణ్యపు వాగు, మురికివర్రె, అలుగువొర్రె, పెద్దవాగు, బర్రిప్పవాగు, గుండంవాగు, రాళ్లవాగు ఇవన్నీ ఒక్క వర్షానికే ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. దీంతో గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. బొమ్మనపల్లి-చింతోనిచెలక నడుమ పుణ్యపు వాగు ఉధృతికి టేకులపల్లి-ఆళ్లపల్లి మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయి. ముత్యాలంపాడు క్రాస్‌రోడు-ప్రెగళ్లపాడు మధ్య, కోయగూడెం-మద్రాస్‌తండా, కోయగూడెం రైస్‌మిల్లు వద్ద, రాజుతండా-జండాలతండా వద్ద, పెట్రాంచెలక-పెట్రాంచెలక స్టేజీ, లక్ష్మీపురం-తడికలపూడి, హరిజనచెర్రి-రాంపురం, బొమ్మనపల్లి-చింతోనిచెలక మధ్య పుణ్యపువాగు, మద్రాస్‌తండా-కొండంగుల బోడు, ఎర్రాయిగూడెం, శంభునిగూడెం-అనిశెట్టిపల్లి, రోళ్లపాడు మార్గంలో బర్రిప్పవాగు వద్ద, గంగారం వద్ద, తూర్పుగూడెం-స్టేషన్‌బేతంపూడి, సులానగర్-తూర్పుగూడెం, బేతంపూడి-కుంటల్ల వద్ద వంతెనలు నిర్మించాల్సి ఉంది.

వంతెనల కోసం ఎదురుచూస్తున్నాం



మా వర్షాకాలం వస్తే వరదతో ఇబ్బందులు పడుతున్నాం. వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటం వల్ల వివిధ పనుల నిమిత్తం గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవ తీసుకుని మండలంలో అవసరం ఉన్న అన్ని చోట్ల వంతెనలు నిర్మించేందుకు కృషి చేయాలి.

– ఈసం శ్రీనివాస్, పెట్రాంచెలక

వ్యవసాయ పనులకు ఇబ్బంది



వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో వ్యవసాయ పనులకు వెళ్లాలంటే ఈ మార్గంలోనే వెళ్లాలి. మనుషులే కాకుండా పశువులు కూడా దాటలేని పరిస్థితి. ఎరువులు, విత్తనాలు ఇతర సామగ్రి తీసుకెళ్లాలంటే వాగు ఉధృతి తగ్గేదాక వేచి ఉండాల్సిన పరిస్థితి.

– లాకావత్ కీమ్యా, ముత్యాలంపాడు క్రాస్ రోడ్

ప్రతిపాదనలు పంపించాం

టేకులపల్లి మండలంలో వంతెనల అవసరం ఉంది. నూతన వంతెనల కోసం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అభ్యర్థన మేరకు ఇప్పటికే అవసరమైన చోట మొత్తం 12 వంతెనల కోసం రూ.35 కోట్లతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించడం జరిగింది. ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులు ప్రారంభం అవుతాయి.

– నవీన్, పీఆర్ ఏఈ

స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి



అధికారులతో మాట్లాడుతున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఉద్యోగులకు ఏరియా జీఎం జాన్ ఆనంద్ ఆదేశించారు. సోమవారం తన చాంబర్‌లో జరిగిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఏరియా జీఎం కార్యాలయంతో పాటు జేకే కాలనీ సీఈఆర్ క్లబ్ నందు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ గనుల్లో ప్రతిభ కనపర్చిన ఉద్యోగులకు, సింగరేణి స్కూల్ పాఠశాల విద్యార్థులకు మెరిట్ సత్కారం చేయనున్నట్లు తెలిపారు. ఎస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, అధికారులు రవికుమార్, బాలాజీ నాయుడు, దిలీప్‌కుమార్, ధనుంజరెడ్డి, అంజిరెడ్డి, పవన్, మహేష్, శివకుమార్, నాగేశ్వరరావు, జీవీ నర్సింహారావు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావం



మాట్లాడుతున్న హరీష్‌గౌడ్

ఇల్లెందు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం జెండా ఎగురవేసి అమరవీరులకు నివాళులర్పించారు. జిల్లా గౌరవాధ్యక్షుడు హరీష్‌గౌడ్, సాయి, విష్ణు, శ్రీకాంత్, రాకేష్, వెంకటేష్, రఘు, ప్రేమ్, రక్షిత్, వివేక్ పాల్గొన్నారు.



జెండావిష్కరణలో నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని జిల్లా కార్యదర్శి ఎస్‌కె.ఫహీందాదా అన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు ఉపేందర్, పట్టణ కార్యదర్శి మజ్జిగ రణధీర్, నాయకులు శివ, విజయ్‌కాంత్, వినయ్ ఉన్నారు.

ఓటు నమోదు చేసుకోండి

ఇల్లెందురూరల్: 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు సమీపంలోని బీఎల్‌వో వద్ద తమ ఓటును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కోట రవికుమార్ అన్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. నమోదు ప్రక్రియ ఈ నెల 20 నుంచి ప్రారంభమవుతుందన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన గనులు



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఇల్లెందురూరల్: మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య, అధ్యాపకులు డాక్టర్ శ్రీదేవి, కృష్ణవేణి, వెంకటేశ్వర్లు, రాకేష్, శ్రీరామ్, డాక్టర్ నాగేశ్వరరావు, శేఖర్, రాజు, డాక్టర్ సీహెచ్ రమేష్, టి.సురేంద్రకుమార్, శ్రీకాంత్, యువకుమార్, లక్ష్మణ్‌రావు, సుజాత పాల్గొన్నారు.



గ్రంథాలయంలో నివాళి..

కొత్తగూడెంఅర్బన్: గ్రంథాలయాల అభివృద్ధికి ఎస్ఆర్.రంగనాథన్ చేసిన సేవలు మరువలేనివని గ్రంథపాలకురాలు జి.మణిమృదుల అన్నారు. సోమవారం గ్రంథాలయ పితామహులు ఎస్.ఆర్.రంగనాథన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ సిబ్బంది మణి మృదుల, నాగన్న విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కేరళ రాష్ట్రంలోని వయనాడు వరద బాధితులకు సహాయార్థం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్పొరేట్ కార్యాలయంలోని పలువిభాగాల ఉద్యోగుల వద్ద విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, బ్రాంచి అధ్యక్షుడు రాజారావు, వెంకన్న, సమ్మయ్య, నాజర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వలతో ప్రమాదం



ఆయిల్ బాల్స్ వేస్తున్న విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: నీటి నిల్వలతో ప్రమాదమని రామవరం నేతాజీ పాఠశాల హెచ్ఎం ప్రభుదయాల్ అన్నారు. సోమవారం నేతాజీ పాఠశాల ఆవరణలో నీటి నిల్వలు ఉన్న చోట మరమ్మతులు చేసి, అధికంగా నీరు ఉన్న చోట ఆయిల్ బాల్స్‌ను వేశారు.

ఘనంగా తీజ్



తీజ్ బుట్టల ఊరేగింపు

టేకులపల్లి: మండలంలోని బొమ్మనపల్లిలోని కొత్తతండ గ్రామంలో సోమవారం తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తీజ్ బుట్టలు ఊరేగించి నిమజ్జనం చేశారు. గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాంకుడోత్ హత్తీరామ్‌నాయక్, నాయకులు భావ్‌సింగ్‌నాయక్, భీమా నాయక్, శ్రీను, లచ్చిరాం, ప్రేమ్ ఉన్నారు.

సీఎంను నిలదీయండి

ఇల్లెందు: సీతారామా ప్రాజెక్టు నీళ్లు ఇల్లెందుకు ఇవ్వకుండా ప్రజలను మోసగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీయాలని ఎన్డీ నేతలు ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం ఇల్లెందులో ఎన్డీ రెండు వర్గాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇల్లెందుతో పాటు కారేపల్లి, మహబూబాబాద్ జిల్లాకు అన్యాయం జరుగుతుందన్నారు. నాగేశ్వరరావు, సీతారామయ్య, ఐలయ్య, రమేష్, చిరంజీవి పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని పునుకుల గ్రామంలో సోమవారం ఉల్వనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ తేజశ్రీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ భీమ్‌సింగ్, ఎల్ఎంహెచ్‌పీ ఈశ్వరి, ఎంపీహెచ్ఏ శంకర్, వరలక్ష్మీ, రమా, ఆశలు పాల్గొన్నారు.

జూలూరుపాడు: మండలంలోని గాంధీనగర్ గ్రామంలో జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీహెచ్ఓ రామక్రిష్ణ, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్ఎం సావిత్రి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



పాల్వంచరూరల్: పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



జూలూరుపాడులో..

జీపీఎఫ్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



కూనంనేనికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పాల్వంచ: ప్రభుత్వ యంత్రాంగంలో కీలకంగా పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమం ఎంతో అవసరమని, జీపీఎఫ్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, తన వంతు పోరాటంలో ముందుంటానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం స్థానిక ఇంజనీర్స్ అసోసియేషన్ హాల్ నందు జీపీఎఫ్ సాధన కమిటీ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేనికి అన్ని కార్మిక, ఉద్యోగ, ఇంజనీర్ల సంఘాల నేతలు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఉద్యోగులు ఐక్యంగా పోరాటంలో ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంగీలాల్, కోటేశ్వరరావు, రమాకాంత్, సుధాకర్, సురేష్, రవీందర్, రవీందర్‌రెడ్డి, శ్రీధర్, వేణుగోపాల్, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు స్వాగతం పలికిన నాయకులు



మంత్రి భట్టివిక్రమార్కకు స్వాగతం పలుకుతున్న కొత్వాల

పాల్వంచరూరల్: మండల పరిధిలోని పర్యాటక ప్రాంతమైన కిన్నెరసాని పర్యాటనకు సోమవారం వచ్చిన రాష్ట్ర మంత్రులు భట్టివిక్రమార్క, జూపల్లికృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ ఆర్.రాఘురాంరెడ్డితోపాటుకలిసి వచ్చిన ఎమ్మెల్యేలకు స్థానిక కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు వారికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, కె.రాము, చింతా నాగరాజు, పులి సత్యనారాయణ, వై.వెంకటేశ్వర్లు, ధారా చిరంజీవి, మహేష్, శాంతివర్ధన్, రాంబాబు, పాషా, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందురూరల్: సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ చంద్రభాను సూచించారు. మండలంలోని రొంపేడు చెక్‌పోస్టు వద్ద సోమవారం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, ట్రాఫిక్ నియంత్రణలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్లో డబ్బులు పడ్డాయని, రుణమాఫీ, బీమా కింద డబ్బులు వస్తాయని సెల్‌ఫోన్లలో లింకులు పంపుతుంటారని, వాటిని ఎవరూ ఓపెన్ చేయొద్దని సూచించారు. ఏదైనా అనుమానం ఉంటే నేరుగా బ్యాంకుకు వెళ్లి నివృత్తి చేసుకోవాలన్నారు. మాదకద్రవ్యాల విక్రయంపై ఎలాంటి సమాచారం ఉన్నా తమకు తెలియజేయాలన్నారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ బత్తుల సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా కేంద్రంలో బస్టాండ్ ఎదురుగా మధురబస్తీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న సెల్లార్ నిర్మాణం నిలుపుదల చేయాలని ఫిర్యాదు చేసినా కమిషనర్ స్పందించటంలేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంధం మల్లిఖార్జునరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాళోత్ వీరూనాయక్, పాల్వంచ పట్టణ అధ్యక్షుడు కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, జిల్లా మహిళా కన్వీనర్ యర్రంశెట్టి రాజేశ్వరి, వినయ్ ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పాల్వంచ: మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేయాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఇటర్నేషనల్ బ్యూటీషియన్ ట్రైనర్ స్వప్న అన్నారు. సోమవారం పాల్వంచలోని నవమహిళా సాధికార కేంద్రంలో అందం, ఆరోగ్యంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యూటీషియన్ కోర్సుల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు సర్టిఫికెట్లను అందించారు. నవభారత్ సంస్థ చేపడుతున్న సంఘ సేవా కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు అనిల్, భానుప్రకాష్, దీప్తి, అనూష, ఆదిత్య, శ్రీనివాస్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి కృషి

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా తమ పనితీరు మెరుగుపర్చుకోవాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అసంపూర్తి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎంపీఓ చిరంజీవి, ఏపీఓ శంకర్, సిబ్బంది ఉన్నారు.

వేధిస్తున్న భర్తపై కేసు

పాల్వంచరూరల్: భార్యను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదైంది. మండలంలోని రంగాపురానికి చెందిన ఓంప్రకాశ్ వివాహేతర సంబంధం పెట్టుకుని తనను వేధిస్తున్నాడని ఆయన భార్య రమాదేవి ఫిర్యాదు చేసింది. దీంతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

ఫోన్ అందజేత

టేకులపల్లి: మండలంలోని బొమ్మనపల్లికి చెందిన లక్‌పతి ఫోన్ పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను కనుగొని సోమవారం పోలీసులు లక్‌పతికి అందజేశారు. సీఐ తాటిపాముల సురేష్, ఎస్సై పోగుల సురేష్‌లు అందజేశారు. పోలీసులకు బాధితుడు కృతజ్ఞతలు తెలియజేశాడు.

నివాళి

జూలూరుపాడు: ఇటీవల జూలూరుపాడుకు చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు సిరిపురపు నారాయణ(90) మృతి చెందగా సోమవారం దశదిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లేళ్ల వెంకటరెడ్డి, మధుసూదన్‌రావు, కొలిపాక బాబురావు, రంగారావు, పుల్లారావు తదితరులు ఉన్నారు.

కార్మికురాలికి పరామర్శ..

సింగరేణి(కొత్తగూడెం): ఇటీవల విధి నిర్వహణలో గాయపడ్డ కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని సివిల్ విభాగంలో కాంట్రాక్ట్ కార్మికురాలు విజయకుమారిని సోమవారం సీఐటీయూ నాయకులు పరామర్శించారు. నాయకులు వీరన్న, గిడ్ల శ్యాం తదితరులు ఉన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను ఆదుకోవాలి



పాల్వంచ: నివాళులర్పిస్తున్న నాయకులు



ఇల్లెందులో..

ఇల్లెందు/ ఇల్లెందు రూరల్: సమగ్ర శిక్షా అభియాన్‌లో పని చేస్తూ అమరులైన ఉద్యోగుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు డి. వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం ఇల్లెందులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇటీవల మరణించిన ఉద్యోగులకు నివాళులర్పించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆనంద్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు రమేష్ పాల్గొన్నారు.

టేకులపల్లి: సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన ఉద్యోగుల చిత్రపటాలకు టేకులపల్లి విద్యావనరుల కేంద్రం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యూనియన్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలఅధ్యక్షురాలు దారావత్ పార్వతి, మండల గౌరవాధ్యక్షుడు బి.భాస్కర్‌రావు, మహిళా అధ్యక్షురాలు బి.సంధ్యారాణి, మండల కోశాధికారి బి.గోపాల్‌రావు, ఉపాధ్యక్షుడు ఎస్.చందర్‌రావు, నాగేశ్వరరావు, అబ్బయ్య, బాలాజీ, రవి, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

పాల్వంచ: సమగ్ర శిక్షాలో పనిచేస్తూ మృతి చెందిన స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్, ప్రధాన కార్యదర్శి భట్టు చందు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరావు, పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు సంగమేశ్వరరావు, పూర్ణచందర్‌రావు, రాంబాబు, రమేశ్ రాథోడ్, అర్జున్, దుర్గ, కిషన్, ప్రవీణ్, ప్రభాకర్, అనిత, తులసీ పాల్గొన్నారు.